RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | బుధవారం | పేజీలు : 4
సంపుటి : 3, సంచిక : 91 | ఫిబ్రవరి 26, 2025 | వెల : రూ.3-00

www.vedhanews.in

**విలేకరులు కావలెను**

ప్రజా సమస్యల పరిష్కారమే మా ఎజెండా..ఇంత కాలం మేము ప్రచురించిన కథనాలే అందుకు ఉదాహరణ.. నిజమైన, నిఖార్సైన జర్నలిజానికి వేదికగా నిలుస్తున్న 'వేద న్యూస్' తెలుగు దినపత్రికలో నిజాలు రాసి నిఖార్సైన జర్నలిస్టుగా రాణించాలనుకునే వారికి ఇదే మా ఆహ్వానం..

9701923260, 9701920379





# ఉక్కుపాదం ఉత్తే మాటేనా?

- యథేచ్ఛగా అక్రమ ఇసుక రవాణా..
- అధికారుల ఆఫీసు ముందు నుంచే..!
- దళారులకు పుష్కలంగా కొందరు ఆఫీసర్ల అండదండలు!
- ఇసుకాసురులకు సెప'రేటు'గా పోలీసుల సహకారం!

**వేద న్యూస్, పెద్దపల్లి:**

ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలని ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి అధికారులకు ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. అక్రమంగా శాండ్ సప్లయ్ చేస్తూ సర్కారు ఆదాయానికి గండికొడుతున్న అక్రమార్కుల ఆటలకు అడ్డుకట్ట వేయాలని, క్షేత్రస్థాయిలో ఆఫీసర్లకు ఆదేశాలు జారీ అయ్యాయి. కానీ, క్షేత్రస్థాయిలో మాత్రం సీఎం మాటలు ఉత్తుత్తి మాటలే అనే విధంగా అక్రమ దందా కొనసాగుతుండటం గమనార్హం.

పెద్దపల్లి జిల్లా కాల్వ శ్రీరాంపూర్ మండల పరిధిలోని చుట్టుపక్కల పరిసర ప్రాంతాలు మొట్లపల్లి, కిష్టంపేట, మీర్జంపేట గ్రామాల మానేరు వాగులో దళారులు నిత్యం ఇసుకను అక్రమంగా తరలిస్తున్నా.. సంబంధిత శాఖ అధికారులు తమకేమీ పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు. ఇసుక రవాణాను నియంత్రించి, వాల్టా చట్టాన్ని కాపాడాల్సిన అధికారుల ఆఫీసుల ముందు నుంచి బహిరంగంగా శాండ్ రవాణా చేస్తున్నా కూడా పట్టించుకోవడంలేదని ఆరోపణలు బాహాటంగానే వినిపిస్తున్నాయి. మండలంలోని కొన్ని గ్రామాల ప్రజలు అక్రమంగా ఇసుక తరలించే వ్యక్తులను అడ్డుకునేందుకు ప్రయత్నం చేస్తున్నప్పటికీ ఇసుక దళారులు రాజకీయ నాయకులు పలుకుబడి, అధికారుల వెన్నుదన్నులతో యథేచ్ఛగా రవాణా చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

**ఇసుక దళారులపై అధికారులు మౌనమేల..?**

ఒకవైపు పెద్దపెల్లి జిల్లాలో అన్ని మండలాల పరిధిలోని

మిగతా 4వ పేజీలో..



## బీసీ ఉపాధ్యాయులారా ఏకం కావాలి

- తిరుమలగిరి అశోక్

**వేద న్యూస్, మిర్యాలగూడ ప్రతినిధి :**

ఖమ్మం, నల్గొండ, వరంగల్ ఉపాధ్యాయ ఎన్నికలలో బీసీ అభ్యర్థి అయినటువంటి పూల రవీందర్‌ని గెలిపించాలని కోరుతూ మిర్యాలగూడలో మహాత్మా జ్యోతిరావు పూలే భవన్‌లో బీసీ యువజన సంఘం సమావేశం లో బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ మాట్లాడారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అత్యధిక ఓట్లు బీసీలే ఉన్నప్పటికీ కొన్ని యూనియన్లు అగ్రవర్ణాలను అభ్యర్థులుగా కేటాయించి బీసీ ఉపాధ్యాయులను ఓటు వేసే వ్యక్తిలానే చూస్తున్న అగ్రవర్ణాలకు చెంపపెట్టుల బీసీలందరూ సంఘటితంగా బీసీ అభ్యర్థులకు వేసి, మన ఓటు మన వాళ్లకే వేసుకొని ఉపాధ్యాయుల ఐక్యత చాటాలని అన్నారు. రాష్ట్రంలో పెద్ద ఎత్తున బీసీ ఉద్యమం ముందుకు పోతున్న సందర్భంలో రాష్ట్రం లో రెండు ఎమ్మెల్సీ ఎన్నికల లో బీసీలు విజయం సాధిస్తే రాష్ట్రంలో బీసీ వాదం బలపడుతుందని అలాగే భవిష్యత్తులో మన బీసీ రాజ్యం వస్తుందని ఆయన అన్నారు. అగ్రవర్ణాలకు ఈ డబ్ల్యూ ఎస్ రిజర్వేషన్లు రాత్రికి రాత్రి ప్రకటించి బీసీ పిల్లల ఉద్యోగాలు తన్నుకు పోయిన సందర్భం ఉపాధ్యాయులు మరిచి పోవద్దని, ఎంతోమందికి సమాజంలో జరిగే అన్యాయాలు అక్రమాలు గురించి విద్యను బోధించే ఉపాధ్యాయులు దయచేసి ఈసారి మన ఓటు మన వాళ్ళకే వేసుకుని భవిష్యత్తు రాష్ట్ర రాజకీయంలో బీసీలే క్రియాశీలకంగా ఉండే అవకాశం ఉంటుంది బీసీ ఉపాధ్యాయ సోదరులందరికీ చేతులు జోడించి నమస్కరించి చెప్తున్నా మన ఓటు మన భవిష్యత్తు అని దయచేసి ఈసారి మన ఓటు మన అభ్యర్థి అయినటువంటి పూల రవీందర్ కి వేసి భవిష్యత్తు తెలంగాణ రాష్ట్రంలో బీసీల రాజ్యం వచ్చేలా పోరాటం చేద్దామని ఆయన అన్నారు. దాసరాజు జయరాజ్, మహేష్ గౌడ్,సురేష్ యాదవ్,గంగాధర్, ఉపేందర్, రమేష్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

## నిర్దిష్ట పన్నుల లక్ష్యాన్ని సాధించాలి

- సిడిఎంఏ డా.టికె శ్రీదేవి
- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కమిషనర్లు అధికారులతో పన్ను వసూళ్ల పై సమీక్ష





**వేద న్యూస్, వరంగల్ :**

పన్నుల సేకరణలో నిర్దిష్ట లక్ష్యాన్ని సాధించాలని కమిషనర్ &డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (సిడిఎంఏ) డా.టి.కే శ్రీదేవి అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మున్సిపల్ కమిషనర్లు అధికారులతో మంగళవారం పన్ను వసూళ్ల పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సిడిఎంఏ సమీక్షించారు. జిడబ్ల్యూ ఎంసీ వరంగల్ నుండి బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాఖడే పన్ను వసూళ్ల పురోగతిని వివరిస్తూ ఈ ఆర్థిక సం. లో 117.26 కోట్ల లక్ష్యం కాగా, ఇప్పటివరకు 51.91 కోట్ల పన్నుల సేకరణ చేశామని అన్నారు. మిగిలిన పన్ను వసూళ్లకు రెవేన్యూ సిబ్బంది బడా బకాయి దారులకు ఇప్పటికే రెడ్ నోటీసులు అందజేసి పన్నులు చెల్లించాలని కోరుతూ క్షేత్ర స్థాయి లో ప్రచారం చేయడం తో పాటు బకాయి దారులకు బల్క్ మెసేజ్ లు పంపించడం, పెద్ద మొత్తంలో బకాయి ఉన్న సంస్థలు యాజమాన్యాల వద్దకు బృందాలు గా వెళ్లి వసూళ్లు జరపడం వంటి కార్యక్రమాలు కొనసాగుతున్నట్లు కమిషనర్ సిడిఎంఏకు వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కమిషనర్ జోనా, డిప్యూటీ కమిషనర్లు రవీందర్, ప్రసన్న రాణి, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



'వేద న్యూస్' పాఠకులకు, శ్రేయోభిలాషులకు, ప్రకటనకర్తలకు మహాశివరాత్రి పర్వదిన శుభాకాంక్షలు

- వేద న్యూస్ యాజమాన్యం

## జర్నలిస్టుల సమస్యలు సీఎం దృష్టికి తీసుకెళ్తా

- హెచ్‌యూజే నాయకులకు మంత్రి కొండా సురేఖ హామీ

**వేద న్యూస్, హైదరాబాద్ :**



రాష్ట్రవ్యాప్తంగా వివిధ సంస్థల్లో పనిచేస్తున్న జర్నలిస్టుల సమస్యలను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే ప్రయత్నం చేస్తానని అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. మంగళవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (హెచ్యూజే–టీడబ్ల్యూజేఎఫ్) నాయకులు మంత్రి కొండా సురేఖను కలిశారు. ఈ సందర్భంగా హెచ్యూజే 2025 మీడియా డైరీని మంత్రికి అందజేశారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను హెచ్ యుజే అధ్యక్ష, కార్యదర్శులు అరుణ్ కుమార్, జగదీశ్వర్ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. జర్నలిస్టుల కుటుంబాలకు ప్రభుత్వం హెల్త్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని వారు కోరారు. ప్రభుత్వ ఉద్యోగుల కొత్తగా ఇస్తున్న హెల్త్ కార్డులతో కలిపి జర్నలిస్టులకు హెల్తు కార్డులు ఇవ్వాలని కోరారు. లేనిపక్షంలో ప్రతి జర్నలిస్టుకు ప్రతి ఏటా రూ.10 లక్షల హెల్త్ ఇన్సురెన్స్ సౌకర్యం కల్పించాలని తెలిపారు. రైతు బీమా మాదిరి అక్రిడేషన్ కార్డు ఉన్న జర్నలిస్టులందరికీ జర్నలిస్టు బీమా అమలు చేయాలని మంత్రిని కోరారు. ఏదేని కారణంతో జర్నలిస్టులు చనిపోతే వారి కుటుంబాలకు కనీసం రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలు అందేలా జీవిత బీమా పథకం తీసుకురావాలని కోరారు. సానుకూలంగా స్పందించిన మంత్రి కొండా సురేఖ జర్నలిస్టుల సంక్షేమం కోసం సీఎం రేవంత్ రెడ్డికి ప్రత్యేకంగా లేఖ రాస్తానని హామీ ఇచ్చారు. వరంగల్ ఇంచార్జ్ మంత్రి అయిన ఐఅండ్ పీఆర్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో కూడా జర్నలిస్టుల సమస్యలపై చర్చిస్తానని చెప్పారు. ఇండ్ల స్థలాల సమస్య విషయంలో సీఎం నిర్ణయానికి అనుగుణంగా ముందుకు వెళ్లాల్సి ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా హెచ్ యు జే కార్యవర్గ సభ్యులు, సీనియర్ మహిళా జర్నలిస్టులు కంచి లలిత, పెద్దిరెడ్డి విజయ తదితరులు మంత్రి కొండా సురేఖకు శాలువా కప్పి సన్మానించారు. మంత్రిని కలిసిన వారిలో హెచ్యూజే వర్కింగ్ ప్రెసిడెంట్ గండ్ర నవీన్, కోశాధికారి బట్టిపాటి రాజశేఖర్, నాయకులు చిట్యాల మధుకర్, క్రాంతి, కొడవటి నవీన్, పూర్ణచందర్, రాజు, రేణయ్య తదితరులు ఉన్నారు.

# ఐదేళ్ల తర్వాత సేమ్ సీన్..



## - నీటి దొంగలు అంటూ ఆరోపణలు

హైదరాబాద్ : తెలంగాణలో కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఆంధ్రప్రదేశ్ లో ఐదేళ్ల పాటు జగన్ సీఎంగా ఉన్నారు. అప్పుడు కాంగ్రెస్ ఇద్దరు కుమ్మక్కయ్యారని, జగన్ తో లాలూచీపడి కేసీఆర్ తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలను పణంగా పెట్టారని ఆరోపించింది. ఇప్పుడు ముఖ్యమంత్రులు మారినా అదే విమర్శ మళ్లీ వినపడుతుంది. ఈసారి తెలంగాణలో ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ఉండగా, ఏపీలో చంద్రబాబు సీఎంగా ఉన్నారు. కృష్ణానది నీటిని ఏపీ తరలించుకుపోతున్నా పట్టించుకోవడం లేదని అప్పుడూ.. ఇప్పుడూ ఆరోపణలు ఒక్కటే. దీనికి ముఖ్యమైన కారణం ఇద్దరి ముఖ్యమంత్రుల మధ్య ఉన్న సాన్నిహిత్యమే కారణమని చెప్పకతపపదు. అదే విపక్షాలకు వరంగా మారిందని చెప్పాలి. ఎందుకంటే కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఏపీలో జగన్ సీఎంగా ప్రమాణ స్వీకార కార్యక్రమానికి వెళ్లి వచ్చారు. తర్వాత ఇద్దరి మధ్య బంధం బలపడింది. జగన్ కూడా ప్రగతి భవన్ కు వచ్చి కేసీఆర్ తో ముచ్చటించారు. కేటీఆర్ కూడా జగన్ సీఎం కాక ముందు ఆయన నివాసానికి వెళ్లి మాట్లాడి వచ్చారు. ఇలా ఈ ఇద్దరి మధ్య సఖ్యత అనేది బాగా ఉందని అందరికీ తెలిసిందే. బహిరంగ రహస్యమే. అయితే రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రుల మధ్య సఖ్యత ఉండటాన్ని ఎవరూ తప్పుపట్టడానికి వీలులేదు. కానీ దానిని రాజకీయ ప్రయోజనాలకు వాడుకుంటూ విపక్షాలు ఎదిగేందుకు చేస్తున్న ప్రయత్నమే ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. మొన్నటి ఎన్నికల్లోనూ జగన్ గెలుస్తారని కేసీఆర్ వ్యాఖ్యానించారురేవంత్, చంద్రబాబు... ఇక 2023 ఎన్నికల్లో తెలంగాణ లో కాంగ్రెస్ రాగా, 2024 ఎన్నికల్లో ఏపీలో కూటమి ప్రభుత్వం వచ్చింది. రెండు ప్రభుత్వాలకు సారూప్యత లేదు. అయితే ప్రస్తుత తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలుగుదేశం పార్టీ నుంచి వచ్చిన వారే కావడంతో పాటు ఆయన రాజకీయ గురువు అని భావించే చంద్రబాబుతో లాలూచీ పడి రాష్ట్ర ప్రయోజనాలు తాకట్టుపెడుతున్నారని ప్రస్తుత బీఆర్ఎస్ ఆరోపిస్తుంది. కొంతకాలం క్రితం చంద్రబాబు కూడా వచ్చి రేవంత్ రెడ్డితో సమావేశమై రాష్ట్ర విభజన సమస్యలపై చర్చించి వెళ్లారు. అయితే ఇద్దరి పార్టీల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో ఎవరి రాష్ట్రం వారికి కావాలి. జగన్ కోసం కేసీఆర్, చంద్రబాబు కోసం రేవంత్ లు రాష్ట్రాన్ని పణంగా పెట్టరు. ఎందుకంటే ఏమాత్రం నలుగురి లో ఏ ఒక్కరు రాష్ట్ర ప్రయోజనాలు పణంగా పెట్టినా ప్రజలు రాజకీయ సమాధి కట్టేస్తారని తెలయని నేతలు కాదు. కృష్ణా నదిని తరలించుకుపోతుంటే కేసీఆర్ చూస్తూ ఊరుకుండరు. అలాగే రేవంత్ రెడ్డి కూడా మౌనంగా ఉండరు. ఖచ్చితంగా పోరాడతారు. కేఆర్ఎంబీ ఒకటి ఉంది. అది నిర్ణయించిన మేరకే నీటి వాటాలుంటాయి తప్పించి ఎవరిష్టం వారు నీటిని తోడుకుపోయే అవకాశం ఉండదు. కానీ రాజకీయాలకు ఇవన్నీ అనవసరం. ఎవరు విపక్షంలో ఉన్నప్పటికీ ఈ ఆరోపణలను కట్టిపెట్టి వాస్తవాలను ప్రజల ముందుంచాలి. అయితే రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులుగా ఎవరున్నా సఖ్యతగానే ఉంటూ ఇరు రాష్ట్రాల రైతుల, ప్రజల కు సాగు,తాగునీరు అందించగలగాలి. అదే కదా? ఎవరైనా కోరుకునేది. అందుకే విపక్షాలు విమర్శలు మాని నహేతుకమైన సూచనలు చేస్తే బాగుంటుంది.

## హోటల్ ధ్వంసం కేసు..ఒకరు అరెస్టు

హైదరాబాద్ : లాలగూడ పీఎస్ పరిధిలో హోటల్ లో దాడి చేసి సిబ్బందిని గాయపరిచిన సలీం అనే వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు. లాలగూడ లోని సూపర్ స్టార్ హోటల్ లో బిర్యానీ తీసుకున్న తరువాత హోటల్ సిబ్బంది డబ్బులు అడగడం తో నన్నే డబ్బులు అడుగుతారా అని సలీం మరో వ్యక్తి జావేద్ లు కలిసి హోటల్ లో రాడ్డు తో ఫర్నిచర్ ధ్వంసం చేయడంతో పాటు సిబ్బంది పై దాడి చేసినట్లు పోలీసులు తెలిపారు. గతంలో కూడా తన సోదరుడు రౌడీ షీటర్ అని చెప్పి హోటల్ లో దౌర్జన్యం చేసేవాడని సలీం పై పిర్యాదు అందినట్లు పోలీసులు తెలిపారు. నిన్న రాత్రి పరారీలో సలీం ను అదుపులోకి తీసుకొని రిమాండ్ కు తరలిస్తున్నట్లు తెలిపారు.

## ఘనంగా కేంబ్రిడ్జ్ స్కూల్ స్పోర్ట్స్ డే వార్షికోత్సవం

హైదరాబాద్ : హైదరాబాద్ అంబర్పేట మున్సిపల్ మైదానంలో గోల్నాక లోని కేంబ్రిడ్జ్ స్కూల్ స్పోర్ట్స్ డే వార్షికోత్సవం ను ఘనంగా నిర్వహించారు. స్కూల్ నిర్వాహకుడు ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ డిప్యూటీ చైర్మన్ మహమ్మద్ యాసిన్ షరీఫ్ అతిధులను ఆహ్వానించాగా ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ రాజ్యసభ సభ్యుడు వి హనుమంతరావు హాజరై స్వర్గీయ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ కు నివాళులు అర్పించి స్పోర్ట్స్ డే జెండా ఆవిష్కరణ చేసి స్పోర్ట్స్ డేని ప్రారంభించాడు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ విద్యార్థులు చదువులతోపాటు ఆటలలో రాణించాలని అందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం అన్ని విధాలుగా అవకాశాలను కల్పిస్తుందని ఆదిశగా విద్యార్థులు అన్ని రంగాలలో ముందుకెళ్లాలని అన్నాడు కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థుల ఆటల పోటీలతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు మన్మోహన్ సింగ్ వేషధారణతో కూడిన చిన్నారుల లఘునాటికలు నృత్యాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పిసిసి జనరల్ సెక్రెటరీ లక్ష్మణ్ యాదవ్ ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి తొలుపునూరి కృష్ణ గౌడ్ ఆనంద్ గౌడ్ శ్రీమంత్ గిరి తదితరులు పాల్గొన్నారు. అతిథులను కేంబ్రిడ్జ్ స్కూల్ నిర్వాహకుడు మహమ్మద్ యాసిన్ షరీఫ్, స్కూల్ ప్రిన్సిపాల్ సయ్యద్ అబదుల్ల సత్కరించారు. వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేసి మన్మోహన్ సింగ్ వేషధారణలో ఉన్నటువంటి విద్యార్థిని ప్రత్యేకంగా అభినందించారు అతిధులు. కార్యక్రమంలో స్కూల్ వైస్ ప్రిన్సిపాల్ అసిమా అంతుల్ల కోఆర్డినేటర్ మోహిన్ అహ్మద్ షేక్ అబూ బాకర్ తదితరులు విద్యార్థులను కోఆర్డినేట్ చేశారు.

## యూట్యూబ్ ఛానల్ ముసుగులో స్పా సెంటర్ నిర్వహణ..

విజయవాడ : విజయవాడ వెటర్నరీ కాలనీ సర్వీస్ రోడ్ లోని ఓ స్టూడియోపై పోలీసుల దాడి జరిగింది. పది మంది మహిళలు, 13 మంది విటులను అదుపులోకి తీసుకున్నారు. మహిళలంతా ఇతర రాష్ట్రాలకు చెందిన వారుగా గుర్తించారు. చలసాని ప్రసన్న భార్గవ్ యూట్యూబ్ ఛానల్ ను అడ్డం పెట్టుకుని స్పా సెంటర్ నిర్వహిస్తున్నట్లు సమాచారం. భార్గవ్ ప్రస్తుతం పరారీలో ఉన్నారు,. మాచవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మాచవరం సీఐ ప్రకాష్ మాట్లాడుతూ వెటర్నరీ కాలనీలో స్టూడియో 9 పేరున స్పా ముసుగులో వ్యభిచారం జరుగుతుంది. ఉత్తర భారత దేశమైన హిమాచల్ ప్రదేశ్ ఢిల్లీ ఉత్తరప్రదేశ్ నుంచి మహిళలను తీసుకువచ్చారు. ఆన్లైన్ ద్వారా విటులకు గ్యాలం వేస్తున్నారు. యూని సెక్స్ సెలూన్ పేరుతో క్రాస్ మసాజ్ లకు నిర్వహిస్తున్నారు. స్టూడియో 9 స్పా ఓనర్ చలసాని భార్గవ్ స్పాను నిర్వహిస్తున్నారని మేనేజర్ శ్యామ్ స్టేట్మెంట్ ఇచ్చాడు. సీసీ కెమెరాలు, హై సెక్యూరిటీ లాక్ డోర్లను స్పా సెంటర్ కు ఏర్పాటు చేసి పోలీసుల రాకను ముందుగానే గమనిస్తున్నారు. గతంలో అనేకసార్లు వీరిని హెచ్చరించాం. విజయవాడ నగరంలో స్పా పేరుతో క్రాస్ మసాజులు చేసేవారిపై ప్రత్యేక దృష్టి సారించామని అన్నారు. ఒక యూట్యూబ్ ఛానల్ కు కూడా చలసాని భార్గవ్ నిర్వహిస్తున్నట్లుగా సమాచారం ఉంది.. యూట్యూబ్ ఛానల్ ఉద్యోగులు ఎవరిని మేము అదుపులోకి తీసుకోలేదు విచారణ చేయలేదు. చలసాని ప్రసన్న భార్గవ్ ప్రస్తుతం పరారీలో ఉన్నాడు త్వరలోనే అతనిని పట్టుకుంటామని అన్నారు.

## కరీంనగర్ సమీపంలో చింతకుంట వద్ద ఘోర ప్రమాదం

### - అదుపు తప్పి డివైడర్ ను ఢీ కొట్టిన బైక్
### - ఒకరు మృతి.. మరొకరికి తీవ్ర గాయాలు

కరీంనగర్ : కరీంనగర్ సమీపంలోని చింతకుంట వద్ద తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీ కొట్టి రోడ్డుపై పడడంతో బైక్ పై ఉన్న ఇద్దరు యువకుల్లో ఒకరు అక్కడికక్కడే మృతి చెందాడు. మరొకరు గాయపడ్డారు. మృతుడు గాయపడ్డ యువకుడు కరీంనగర్లోని న్యూ శ్రీనగర్ కాలనీకి చెందిన వారుగా గుర్తించారు. ప్రమాద దృశ్యాలు సిసి కెమెరాల్లో రికార్డ్ అయ్యాయి. ప్రమాదం జరిగి రోడ్డుపై పడ్డ యువకుడు ఒకరు లేచి దారిలో పోయేవారిని ఆపే ప్రయత్నం చేసిన ఎవరు ఆగకుండా వెళ్ళిపోయారు. సోషల్ మీడియాలో ఈ వీడియో వైరల్ గా మారింది. ప్రమాదం పై కొత్తపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## సీఎం రేవంత్ రెడ్డికి బిఆర్ఎస్ నేత మాజీ ఎంపీ వినోద్ కుమార్ బహిరంగ లేఖ

కరీంనగర్ :కాళేశ్వరం ప్రాజెక్టును బద్నాం చేసేందుకు మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటుపై కాంగ్రెస్ బిజేపి రాజకీయం చేశాయని బిఆర్ఎస్ నేత మాజీ ఎంపీ వినోద్ కుమార్ ఆరోపించారు. మరమ్మత్తుల పేరుతో కాలయాపన చేస్తూ రైతులతో చెలగాటం ఆడొద్దని హితవు పలికారు. కరీంనగర్లో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు జివి రామకృష్ణారావుతో కలిసి మీడియాతో మాట్లాడిన వినోద్ కుమార్, కాంగ్రెస్ ప్రభుత్వ తీరు బిజెపి నేతల వైఖరిపై మండిపడ్డారు. కేసీఆర్ నేతృత్వంలో పదేళ్ళు రైతులకు సాగునీటికి డోకా లేకుండేనని, కాంగ్రెస్ ప్రభుత్వం తొలి ఏడాదిలోనే రైతులకు నీళ్లు ఇవ్వలేని దుస్థితి నెలకొందన్నారు. మరమ్మత్తులకు నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ అనుమతులకు సంబంధం లేదని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో డ్యాం ఓనర్ గా తెలంగాణ ప్రభుత్వం ఉందన్న విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టును రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవాలని ప్రభుత్వం చూస్తుందని విమర్శించారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి లేఖ రాయడంతోనే స్టేట్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నుంచి మేడిగడ్డ అంశం నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ పరిధిలోకి వెళ్ళిందన్నారు. మేడిగడ్డ బ్యారేజ్ పాక్షిక కుంగుబాటును చూపించి కాళేశ్వరం ప్రాజెక్టు ఒక విఫల ప్రాజెక్టుగా చిత్రీకరించే ప్రయత్నం చేశారని ఆరోపించారు. ఇప్పటికైనా కుంటి సాకులు చెబుతూ కాలయాపన చేయకుండా తక్షణ చర్యలపై దృష్టి పెట్టాలని కోరారు. బ్యారేజీల శాశ్వత మరమ్మత్తులు పూర్తిచేసి కాళేశ్వరం ప్రాజెక్టును నీళ్లను వినియోగించుకునేలా కార్యాచరణ చేపట్టాలన్నాలరు వినోద్ కుమార్.

## యూరియా కొరతతో రైతుల ఆందోళన

కరీంనగర్ : అరకొర స్టాక్ తో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల వద్ద రైతులు క్యూ కడుతున్నారు. రైతులు. చిగురుమామిడి మండలం ఇందుర్తిలో యూరియా కోసం చెప్పులు క్యూలో పెట్టారు. రైతుకు రెండు మూడు బ్యాగుల కంటే ఎక్కువ ఇవ్వని పరిస్థితి నెలకొంది. జిల్లాలో 42 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరమని అధికారులు ఇండెంట్ పెట్టారు. జిల్లాకు వచ్చిన స్టాక్ 37 వేల మెట్రిక్ టన్నులు మాత్రమే. రైతులు సాగుచేసిన పంటలకు ప్రస్తుతం మరో 10 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం. సరిపడ యూరియా నిల్వలు లేకపోవడంతో ఎక్కువ రేటుకు ప్రైవేట్ ట్రేడర్స్ విక్రయిస్తున్నారు. సహకార సంఘాల్లో 270 రూపాయలకు లభిస్తున్న యూరియా, ప్రైవేట్ ట్రేడర్స్ 330 నుంచి 350 రూపాయలకు విక్రయిస్తున్నారు. ఎక్కువ రేటు పెట్టి కొందామన్నా దొరకని పరిసితులో అన్నదాతలు ఆందోళనకు దిగారు.

## సిబ్బంది సమస్యల పరిష్కారంకే "పోలీస్ దర్బార్"

గోదావరిఖని : రామగుండం కమిషనరేట్ స్పెషల్ పార్టీ, క్యూఆర్టి సిబ్బంది, అధికారులకు రామగుండం కమిషనర్ ఆఫ్ పోలిస్ ఎం. శ్రీనివాస్ ఐపిఎస్., ఆదేశాల మేరకు శనివారం నాడు కమిషనరేట్ హెడ్ క్వార్టర్స్ లో "దర్బార్"కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం కు సీపీ హాజరై స్పెషల్ పార్టీ, క్యూఆర్టి సిబ్బంది తో మాట్లాడి సమస్యలను, వినతిలను ఒక్కొక్కరిని అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది అడిగిన వినతిలను, సమస్యలను వెంటనె పరిష్కరించే విధముగా చూస్తాం అన్నారు. ఏలాంటి సమస్య ఉన్న దర్బార్ లో చెప్పడం ఇబ్బందిగా ఉంటే ఆఫీస్ కి వచ్చి నేరుగా కలిసి చెప్పవచ్చు అన్నారు. ఈ సందర్బంగా సీపీ మాట్లాడుతూ.....స్పెషల్ పార్టీ, క్యూ ఆర్ టి పోలీస్ విధి నిర్వహణలో భాగంగా ఎన్నో పని ఒత్తిళ్లను ఎదుర్కోనాల్సి వుంటుంది క్రమ శిక్షణ, ప్రణాళికబద్ధంగా విధులు నిర్వహించడంతో ద్వారా ఈ ఒత్తిళ్లను అధిగమించవచ్చని కాని వ్యక్తిగత కారణాలతో ఎదురయ్యే మానసిక ఒత్తిళ్లు చాలా ప్రమాదకరమని కొన్ని సందర్భాల్లో ఈ ఒత్తిళ్ల కారణంగా ఆరోగ్య సమస్యలు ఎదుర్కోనాల్సి వస్తుంది. కొన్ని సందర్భాల్లో ఒత్తిళ్లు తట్టుకోలేక క్షణికావేశంలో తీసుకునే నిర్ణయాలతో కుటుంబ రోడ్డున పడుతుందని ముఖ్యంగా క్షణికావేశంలో తప్పుడు నిర్ణయాలు తీసుకునే ముందు మీ కుటుంబ గురించి ఆలోచించాలని సూచించారు. సిబ్బంది క్రమశిక్షణతో డ్యూటీ లను నిర్వర్తించాలని రామగుండం కమిషనరేట్ కి, తెలంగాణ పోలిస్ మంచిపేరు తీసుకురావాలన్నారు. బయట డ్యూటీస్ కి వెళ్ళినప్పుడు ఇబ్బందుల ఉంటె సంబంధిత అదికారులకు తెలియచేయాలన్నారు. సిబ్బంది క్రమశిక్షణతో, మంచిప్రవర్తన తో విదులు నిర్వర్తించినప్పుడు అదికారులు తమ వెంట ఉంటామన్నారు. సిబ్బందికి చేయవలసిన విధులు, చేయకూడని పనుల గురించి పలు సూచనలు, ఆదేశాలు చేయడం జరిగింది. చెడు వ్యసనాలకు, చెడు స్నేహాలకు అలవాటు పడి, విధులలో నిర్లక్ష్యం వహించినట్లైతే, పోలీస్ శాఖ ప్రతిష్ట కి భంగం కలిగించే విధంగా ప్రవర్తించిన శాఖ పరమైన చర్య తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ సీ. రాజు,ఏఆర్ ఏసీపీ ప్రతాప్, ఆర్ఐ లు దామోదర్, శ్రీనివాస్, ఆర్ ఎస్ఐ లు, సిబ్బంది పాల్గోన్నారు.

## ఆరోగ్యానికి దివ్యౌషదం తెల్లకల్లు

### - ప్రకృతిసిద్ధంగా లభించే కల్లునే సేవించాలి
### - మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

మంథని : తెలంగాణలో సురాపానకంగా బావించే తెల్లకల్లు ఆరోగ్యానికి దివ్య ఔషధంగా పని చేస్తుందని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు. శనివారం ఉదయం మంథని నియోజకవర్గ పరిధిలోని జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలం సింగారం గ్రామంలోని తాటివనంలో ఆయన తాటికల్లు సేవించారు. ఈ సందర్భంగా పుట్ట మధు మాట్లాడుతూ ప్రకృతి సిద్దంగా లభించే తెల్లకల్లును ప్రతి ఒక్కరు సేవించడం ద్వారా అనేక ప్రయోజనాలు ఉంటాయన్నారు. తెల్లకల్లును డాక్టర్లు, శాస్త్రవేత్తలు సైతం చెబుతుంటారని, అనేక వ్యాధులకు ఔషధంగా పనిచేస్తుందని ఆయన వివరించారు. ప్రతి రోజు గౌడులు ఉదయం, సాయంత్రం తాటి చెట్లు ఎక్కి తాటి కల్లు తీసి మన ఆరోగ్యం కోసం కష్టపడుతుంటారని ఆయన కొనియాడారు. కులవృత్తులను ప్రోత్సహించాలన్నదే తన లక్ష్యమని, గతంలో ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో సైతం తెల్లకల్లు సేవించి కల్లు ప్రత్యేకతను చాటానని, ఈనాడు మళ్లీ మంథని కేంద్రానికి 75కిలో మీటర్ల దూరంలో ఉన్న సింగారం వచ్చి ఇక్కడి నుంచి కల్లు విశిష్టతను చెప్పడం జరుగుతుందన్నారు. ఇంగ్లీష్ మందులైన రమ్ము, బ్రాండీ, విస్కీ,బీర్‌లాంటివి సేవిస్తే ఆరోగ్యం చెడిపోతుందని, ఆ బాటిల్స్‌పైనే ఆరోగ్యానికి హనికరం అని రాసి ఉంటుందనే విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తించాలన్నారు. సింగారం గ్రామంలో ఆరువై పాల్లు ఉన్నాయంటే ఇక్కడ ఎక్కువ శాతం గౌడలు ఉంటారన్నారు.ప్రకృతి సిద్దంగా లభించే తెల్లకల్లును ప్రతి ఒక్కరు సేవించి సంపూర్ణ ఆరోగ్యం పొందాలని ఆయన పిలుపునిచ్చారు.




## బల్దియా బకాయిలు ఇన్ని కోట్లా?

హైదరాబాద్ : దేశంలో పేదోళ్లకు, ఉన్నోళ్లకు తేడా ఎంతో ఉంటుందని మనకు తెలుసు. అధికారులు, పాలకులు ఉన్నోళ్లకు ఊడిగం చేస్తూ.. పేదోళ్లను మాత్రం తమ బానిసలుగా భావిస్తూ ఉంటారు. దేశంలో ప్రజలందరూ పన్నులు కడితేనే పాలన సాగుతుంది. రోడ్లు వేయడం, భవనాలు కట్టడం, కరెంట్, ఇతర సౌకర్యాలు అన్ని వన్ను డబ్బులతోనే. అందుకే ప్రభుత్వాలు పన్నులు కట్టండి అంటూ అవగాహన కార్యక్రమాలు చేస్తుంటాయి. అయితే ఈ అవగాహన ఒక్క పేదోళ్లకే అనిపిస్తుంటుంది. ఎందుకంటే నీతిగా, నిజాయితీ పన్నులు కట్టేది పేద, మధ్యతరగతి వాళ్లే. వీరు పన్నులు కట్టకుంటే కరెంట్ ఆపేస్తాం..తలుపులు వీక్కేళ్తాం.. మంచినీటి నల్లా బంద్ చేస్తాం.. అంటూ అధికారులు హెచ్చరిస్తుంటారు. అయితే ధనవంతులకు ఇవన్నీ ఏవీ ఉండవు. వారు కోట్ల రూపాయలు కట్టకపోయినా వారికి సేవలు అందుతూనే ఉంటాయి. ఎప్పుడో ఒకసారి బకాయిల లిస్ట్ పెడుతుంటారు. అవి చూస్తే మనం కంగుతినాల్సిందే.. తాజాగా గ్రేటర్ హైదరాబాద్ ప్రాపర్టీ ట్యాక్స్(ఆస్తి పన్ను) వసూళ్లకు సంబంధించి జీహెచ్ఎంసీ అధికారులు షాకింగ్ విషయాలు వెల్లడించారు. జీహెచ్ఎంసీకి కొంత మంది కోట్ల రూపాయల పన్నులు ఎగవేసినట్టు అధికారులు గుర్తించారు. అందులో కీలక సంస్థలు ఉండడం విస్తుగొలుపుతోంది. ఏళ్లుగా పన్నులు చెల్లించకపోవడంతో అవి కోట్ల రూపాయలకు చేరుకున్నట్లు నిర్ధారించారు. బకాయిల వసూలు కోసం స్పెషల్ డ్రైవ్ లో ఈ సంచలన విషయాలు వెల్లడయ్యాయని చెబుతున్నారు అధికారులు. ప్రాపర్టీ ట్యాక్స్ చెల్లించనవి వారికి నోటీసులు జారీ చేస్తున్నట్లు అధికారులు చెప్పారు. ఒక్క ఖైరతాబాద్ జోన్ పరిధిలోనే 100 మందికి రెడ్ నోటీసులు ఇచ్చినట్లు వెల్లడించారు. నోటీసులకు స్పందించకపోతే ప్రాపర్టీ సీజ్ చేస్తామని హెచ్చరించారు అధికారులు. రూ. 5లక్షలకు పైగా ఉన్న బకాయిల విలువ ఏకంగా రూ.860 కోట్లు. జూబ్లీహిల్స్ లాండ్ మార్క్ ప్రాజెక్ట్ బకాయి విలువ రూ.52 కోట్లు అని, ఎల్ అండ్ టీ మెట్రో రైలు బకాయి రూ.32 కోట్లు అని అధికారులు గుర్తించారు. హైదరాబాద్ అస్ బెస్టాస్ సంస్థ రూ.30 కోట్లు, ఇండో అరబ్ లీగ్ రూ.7.33 కోట్లు, ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ రూ.5.50 కోట్లు, సోమాజీగూడలోని కత్రియా హెటల్ రూ.8.62 కోట్ల ప్రాపర్టీ ట్యాక్స్ బకాయి పన్నులు చెల్లించాలని తెలిపారు. వీరంతా తాము జారీ చేసిన రెడ్ నోటీసులకు స్పందించాలని, లేకుంటే ఆస్తులను సీజ్ చేస్తామని అధికారులు హెచ్చరించారు. ఈ బకాయిల లిస్ట్ సిటీ జనాలు నివ్వెరపోతున్నారు. తాము వెయ్యి, రెండు వేల ఇంటి పన్ను కట్టకుంటే అధికారులు నానా యాగీ చేస్తారని, మరి కోట్ల రూపాయల బకాయిలు ఉన్న వారికి నెమ్మదిగా నోటీసులు ఇవ్వడమేంటని ప్రశ్నిస్తున్నారు.

## అంతు పట్టని దళపతి వ్యూహం



హైదరాబాద్ : నెలల లాంగ్ రెస్ట్ తర్వాత గులాబీ బాస్ జనంలోకి వచ్చారు. పార్టీ ఆఫీస్ లో మీటింగ్ పెట్టారు. ఇంత చేసి భవిష్యత్ పై దిశానిర్దేశం చేస్తారని చాలా మంది గులాబీ లీడర్లు అనుకున్నారు. కానీ కేసీఆర్ మాత్రం తెలంగాణ ఉద్యమ చరిత్ర, బీఆర్ఎస్ పాత్రపై గంటలు గంటలు మాట్లాడారు. మళ్లీ సెంటిమెంట్ రగిల్చి లాభపడే ఉద్దేశమే తప్ప.. భవిష్యత్ లో ఏం చేద్దాం.. ఎలా ముందుకెళ్దాం అన్న పాయింట్లు లేకుండా పోయాయన్న వాదన వినిపిస్తోంది. ఆత్మ స్తుతి, పరనింద ఇదేనా గులాబీ బాస్ కొత్త సందేశం మరోసారి తెలంగాణ ఉద్యమ చరిత్ర, అందులో కేసీఆర్ పాత్ర, సెంటిమెంట్ చుట్టూనే మ్యాటర్ మొత్తం తిప్పారు. పార్టీ నేతలతో మాట్లాడిన స్పీచ్ లో ఎక్కువ దానికే కేటాయించారు. ఎక్కడైనా చేసిన పని గెలిపిస్తుంది. నిలబెడుతుంది. ఇంకా ఎన్నాళ్లు సెంటిమెంట్ ను పట్టుకుంటారన్న విమర్శలను ప్రత్యర్థులు వినిపిస్తున్నారు. ఇంత చేసి గత పదేళ్లలో ఉద్యమకారులకు కేసీఆర్ ఏపాటి గౌరవం ఇచ్చారన్న ప్రశ్నలు వచ్చి పడుతున్నాయ్.రాకరాక జనంలోకి వచ్చి పార్టీని ఎలా జనంలోకి తీసుకెళ్లాలన్న విషయంపై దిశానిర్దేశం చేసుకోవాలి. కానీ విస్తృతస్థాయి మీటింగ్ లో అలా జరగలేదు. ఏదో అనుకుని ఇంకేదో చెప్పారా.. అన్న టాక్ ఇంటర్నల్ గా నడుస్తోంది. తమ పాలన భేష్, కాంగ్రెస్ పాలన బేకార్ అన్నట్లుగా మాట్లాడారు. అన్ని రంగాలు పడకేశాయన్నారు. అన్ని వర్గాల వారు రోడ్డున పడ్డారన్నారు. ప్రతిపక్ష నేతగా ఇవన్నీ రొటీన్ డైలాగ్స్. అయితే కొంత వరకైనా కనెక్ట్ అయ్యేలా ఉండాలి కదా అన్న పాయింట్ ను ప్రత్యర్థులు వినిపిస్తున్నారు. బీఆర్ఎస్ పార్టీ ఇప్పుడు ఏ పొజిషన్ లో ఉంది. అన్నది కేసీఆర్ చూసుకోవడం లేదా అన్న పాయింట్ కూడా చర్చకు వస్తోంది. నడిపించే నాయకుడు జనానికి దూరంగా.. ఉంటే నష్టం ఎవరికి అన్నది కూడా ఆలోచించడం లేదా అంటున్నారు. ప్రధాన ప్రతిపక్ష నేతగా అసెంబ్లీకి వచ్చి.. ప్రభుత్వం ఏవైనా తప్పులు చేస్తే నిలదీయడం, ఎండగట్టడం, సలహాలు ఇవ్వడం వంటివి కూడా చేయకపోతే ఎలా అన్న పాయింట్ కూడా తెరపైకి వస్తోంది. అంతెందుకు కులగణనలో పాల్గొనకుండా తిరిగి ఆ సర్వేపైనే విమర్శలు చేయడం.. ఇవన్నీ జనం అబ్జర్వ్ చేసే అంశాలే. అసెంబ్లీ ఎన్నికల్లో పరాజయం తర్వాత బీఆర్ఎస్ పార్టీ గ్రాఫ్ మరింతగా పడిపోయింది. తమకు తెలంగాణలో తిరుగే లేదు అనుకున్న గులాబీ పార్టీకి పార్లమెంట్ ఎన్నికల్లో వచ్చిన సీట్లు సున్నా. ఇది ఎవరూ ఊహించలేదు. అయితే రాష్ట్రంలోనే ఓడారు.. ఇక ఎంపీ సీట్లు గెలిపించడం ఎందుకని జనం దూరం పెట్టేశారు. ఇప్పుడు ఏకంగా ఆదిలాబాద్-నిజామాబాద్- కరీంనగర్-మెదక్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి వరుసగా పోటీ పెట్టకపోవడం కూడా వేరే సిగ్నల్స్ ను పార్టీ శ్రేణుల్లోకి, జనంలోకి తీసుకెళ్తోందిఅంతెందుకు ఈ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ పరిధిలోనే కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు, కవిత ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇలా సొంతంగా ప్రాతినిధ్యం వహించే చోట కూడా అభ్యర్థిని పెట్టి తమ స్టామినా ఏ పొజిషన్ లో ఉందో చూసుకోవాల్సిన టైంలో అస్త్ర సన్యాసం ఏంటన్న ప్రశ్నలకు కూడా తాజా మీటింగ్ లో జవాబు రాకుండా పోయింది. బీఆర్ఎస్ టిక్కెట్ వస్తుందని నమ్ముకున్న రవీందర్ సింగ్ లాంటి లీడర్లు.. ఇండిపెండెంట్ గా నామినేషన్లు వేసుకున్నారు. ఇదేనా గులాబీ బాస్ తమ లీడర్లు, క్యాడర్ కు ఇచ్చుకునే సందేశం?సో తిరిగి పుంజుకున్నాం.. జనంలోనే ఉన్నాం.. అని చెప్పుకోవాల్సిన పోటీలో దూరం ఉండడం గులాబీ పార్టీకి చాలా నష్టం చేసే అంశం. కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు కూడా ఫాంహౌజ్ సీఎం అన్న ప్రచారం జరిగి అది ఓటమికి దారి తీసింది. ఇప్పుడు కూడా పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు అధ్యక్షుడిగా ముందుండి నడపాల్సిన టైంలో ఏకంగా 7 నెలల గ్యాప్ తర్వాత ఫాంహౌజ్ నుంచి బయటకు వచ్చారు. ఇలా జరిగితే క్యాడర్ లో జోష్ పెరిగేదెలా.. లీడర్లలో ఉత్సాహం వచ్చేదెలా అన్నది గులాబీ పార్టీలో ఇంటర్నల్ గా జరుగుతున్న డిబేట్. పనిలో పనిగా కాంగ్రెస్ నేతలు కూడా కేసీఆర్ సీజనల్ పొలిటీషియన్ అంటూ, ఆయన ఫాంహౌజ్ లో పర్మినెంట్ గా రెస్ట్ తీసుకుంటేనే బెటర్ అని కౌంటర్లు కూడా ఇస్తున్నారు.అయిపోయిందనుకున్న పార్టీలు లేచాయి. లేచిన పార్టీలు పడిపోయిన సందర్భాలు చరిత్రలో ఉన్నాయి. అయితే తెలంగాణలో మాత్రం బీఆర్ఎస్ స్పేస్ ను బీజేపీ క్రమంగా ఆక్రమిస్తూ వస్తోంది. ఇది ఆ పార్టీకి అన్నిటి కంటే పెద్ద సవాల్. అలాంటి విషయాలపై దిశానిర్దేశాలు లేకుండా పోవడమే పెద్ద మైనస్ అన్న టాక్ ఆ పార్టీలోనే వినిపిస్తోంది.కాంగ్రెస్, బీజేపీకి చెరో 8 ఎంపీ సీట్లున్నా నిధులు తేలేదన్నారు కేసీఆర్. మరి అదే అధికారంలో ఉన్నప్పుడు కేసీఆర్ ఎన్నిసార్లు ఢిల్లీ వెళ్లి.. ఎన్నిసార్లు ప్రధానిని కలిశారన్న పాయింట్ వినిపిస్తోంది. అటు కృష్ణా జలాలను కాపాడుకోవడం తెలియట్లేదన్నారు. మరి బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు సంగమేశ్వరం పనులు జరుగుతుంటే ఏం చేశారన్న ప్రశ్న తెరపైకి వస్తోంది. ఎమ్మెల్యేలు పార్టీ మారిన చోట్ల బైపోల్స్ రావడం ఖాయమే అంటున్నారు కేసీఆర్. బైపోల్స్ కు పోటీ చేసే ఉత్సాహం గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో లేదా.. ధైర్యం చాలట్లేదా.. గతంలో బలం ఉన్నా ప్రత్యర్థి పార్టీల నుంచి ఎమ్మెల్యేలను ఎందుకు లాగేశారన్న ప్రశ్నలకు జవాబులు లేవు.పార్టీ పని అయిపోయిందని సొంత పార్టీ వాళ్లే ప్రచారం చేయడంతోనే పది మంది ఎమ్మెల్యేలు వెళ్లిపోయారని కేసీఆర్ మీటింగ్ లో అన్నారు. కానీ అక్కడ జరిగింది నిజంగా అదే ఫ్యాక్టరా.. అంటే కాదన్న జవాబు వస్తోంది. మరోవైపు కేసీఆర్ పవర్ లో ఉన్నప్పుడు కేంద్రంతో అంటీ ముట్టనట్లు ఉండడం, ప్రధాని మోడీ రాష్ట్రానికి వచ్చినా కనీసం వెళ్లి కలవకపోవడం, అలక పాన్పు ఎక్కడం, ఎడమొహం పెడమొహం అన్నట్లుగా డీల్ చేయడం ఇవన్నీ జరిగాయి. కేంద్రంతో గట్టిగా కొట్లాడలేదు.. అడగాల్సినవి అడగలేదు. ఫాలోఅప్ చేయాల్సినవి చేయలేదు.. మరి వచ్చేవి ఎలా వస్తాయన్న ప్రశ్నలకు జవాబు లేకుండా పోయింది.ఇంత చేసి తాజా విస్తృతస్థాయి మీటింగ్ లో గులాబీ బాస్ బీజేపీపై ఒక్క మాట కూడా మాట్లాడలేదంటున్నారు. ఇంతకు ముందు కూడా బీజేపీని పెద్దగా టార్గెట్ చేయడం లేదు. బీజేపీ ఇప్పుడు బీఆర్ఎస్ కు డేంజర్ గా మారింది. బీఆర్ఎస్ ఓటు బ్యాంక్ బీజేపీకే వెళ్తోంది. పార్లమెంట్ ఎన్నికల్లోనే ఇది క్లారిఫై అయింది. అలాంటప్పుడు బీజేపీ విషయంలో సాఫ్ట్ గా ఉంటే ఇంకా సమస్యలు ఎదురవుతాయి. కానీ కేసీఆర్ మాత్రం బీజేపీని టార్గెట్ చేసే పరిస్థితిలో కూడా లేరంటున్నారు.

# ‘ఫుడ్’ ఎవరికి?



రాష్ట్ర ప్రభుత్వం అట్టహాసంగా విడుదల చేసిన పాలసీల్లో ‘ఫుడ్ ప్రాసెసింగ్’ కూడా ఒకటి. ఈ పాలసీ వ్యవసాయం, పరిశ్రమల మధ్య కీలకమైన లింక్‌గా పనిచేస్తుందని చెబుతూనే రైతులను విస్మరించింది. పారిశ్రామిక వేత్తలకు ప్రోత్సహకాలు, మార్కెట్ సౌకర్యాలు, లాభాల గురించి పేజీలు, పేజీల్లో పేర్కొన్న ప్రభుత్వం రైతులకు కనీస మద్దతు ధర గురించి ఒక్క మాట కూడా మాట్లాడలేదు. పాలసీ ప్రారంభంలోనే ‘పోస్టు హార్వెస్ట్ లాస్’ను ప్రస్తావించిన ప్రభుత్వం, దానికి పరిష్కారంగా పొలాల వద్దనే ప్రాసెసింగ్ యూనిట్లను,ఎక్స్‌పోర్టు హబ్‌లు, ఫుడ్‌పార్కులను ఏర్పాటుచేయడం గురించి మాట్లాడింది. అయితే, వీటి మొగ్గు ‘వ్యాపారం’ వైపే! ఇక వ్యవసాయరంగంతోపాటు, ఆహార రంగంలోనూ కీలకపాత్ర పోషిస్తున్న మహిళల గురించి ఈ పాలసీ ఒక్క ముక్క కూడా మాట్లాడలేదు. రు. 30 వేల కోట్ల రూపాయల పెట్టుబడులు లక్ష్యంగా, 3 లక్షల ఉపాధి అవకాశాలు సృష్టించడమే ధ్యేయంగా పాలసీలో పేర్కొన్నారు.మనది వ్యవసాయ ప్రధాన రాష్ట్రం. సుదీర్ఘ తీరప్రాంతం గల ఇక్కడ కృష్ణా, గోదావరి నదీ పరివాహక ప్రాంతాల్లో లక్షల ఎకరాల భూములు సాగు అవుతున్నాయి. వ్యవసాయంతో పాటు ఆక్వా, మత్స్య సంపదలో మనకు లోటు లేదు. 2022-23 ఏడాదిలో రాష్ట్రంలో వ్యవసాయ రంగం ఒక్కటే 2.03 లక్షల కోట్ల రూపాయల స్థూల ఉత్పత్తి చేసింది. దేశ ఎగుమతుల్లో కీలక పంటల ఉత్పత్తిలో మన రాష్ట్రమే అగ్రస్థానం. మత్స్య ఎగుమతుల్లో 40 శాతం, పండ్ల ఉత్పత్తిలో 200.64 లక్షల మెట్రిక్ టన్నులతో మొదటిస్థానంలో ఉంది. ఏటా 77 లక్షల మెట్రిక్ టన్నుల కూరగాయలు ఉత్పత్తి చేస్తుంది. 6 ఆపరేషన్ పోర్టులు, 7 విమానాశ్రయాలు, అతిపెద్ద రోడ్డు, రైల్వే నెట్‌వర్క్ రాష్ట్ర నైసర్గిక స్వరూపం. దాదాపు 190 దేశాలకు, 2100 వ్యవసాయ ఉత్పత్తులను ఎగుమతి చేసే రాష్ట్రం మనది.

**పెద్దలకే లబ్ధి..!:** విస్తృత వ్యవసాయ రంగ చరిత్ర ఉన్న ఇక్కడ చిన్న కమతాల రైతులే ఎక్కువ. వ్యవసాయ కార్మికులు, అనుబంధ రంగాల శ్రామికులు ఈ రంగంపై ఆధారపడి జీవిస్తున్నారు. పాలసీ విధివిధానాలను పరిశీలిస్తే వీరికన్నా కార్పొరేట్లే ఎక్కువగా లబ్ధి పొందే అవకాశం కల్పిస్తోంది. పాలసీలో పేర్కొన్న దాని ప్రకారం మెగా ఫుడ్ పార్కుకు కనీసం 100నుండి వెయ్యి ఎకరాల భూమి కావాలి. ఈ తరహా ఫుడ్ పార్కులు జిల్లాకి ఒకటో, రెండో ఏర్పాటవుతాయి. ఐదు నుండి 10 ఎకరాల్లో నానో ఫుడ్ పార్కుల ఏర్పాటుకు అవకాశం ఉంది. భూమిని ప్రైవేటు యజమానులే సమకూర్చుకోవాలని, ప్రభుత్వం అవసరమైన సహకారం ఇస్తుందని పాలసీలో పేర్కొన్నారు. చిన్న, సన్నకారు రైతులకు ఇది అసాధ్యమన్న సంగతి తెలిసిందే.

## ప్రాసెసింగ్ పరిశ్రమ మొగ్గు ఎటు? రైతులు, మహిళల విస్మరణ

అయితే, ఈపేరుతో గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వభూములు, గ్రామకంఠం భూములను పెద్దలకు కట్టబెట్టే అవకాశం ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**ఇవీ అనుభవాలు !:** దేశంలోనే మొట్టమొదటి మెగా ఫుడ్ పార్కుగా చిత్తూరు జిల్లాలో ‘శ్రీని’ నెలకొల్పబడిన విషయం తెలిసిందే. 1200 ఎకరాలతో 2012 నుండి ఇది పనిచేస్తోంది. ఆ తరువాత 2017లో హనుమాన్ జంక్షన్ సమీపంలో మల్లవల్లి మోడల్ ఇండ్రస్టీయల్ పార్క్‌లో 100 ఎకరాల విస్తీర్ణంలో మెగా ఫుడ్ పార్క్ స్థాపించారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో 57.95 ఎకరాల్లో ప్రారంభమైన ‘సెంట్రల్ ప్రాసెసింగ్ యూనిట్’(సిపియు) ఇప్పటి వరకు ఆచరణలోకి రాలేదు. రైతుల నుండి భూములు గుంజుకోవడం గత పార్కుల పనితీరులో కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. మల్లవల్లి పార్కుని పరిశీలిస్తే అశోకా లేల్యాండ్‌కి అప్పగించిన 75 ఎకరాల్లో నిర్మాణాలు తలపెట్టి 1000 మందికి ఉపాధి కల్పిస్తామని చెప్పారు. ఉద్యోగాల మాట అటుంచితే ఇప్పుడు అక్కడ అశోకా లేల్యాండ్ కంపెనీనే పలాయనం చిత్తగించింది. వాస్తవాలు ఇలా ఉంటే, తాజా పాలసీలో లక్షల మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తామంటున్నారు.

**లక్ష్యం రైతు కాదు..!:** రైతులకు గిట్టుబాటు ధరో, కనీస మద్దతు ధరో కల్పించడం ఫుడ్ ప్రాసెసింగ్ లక్ష్యంగా ఉండాలి.కానీ, ప్రభుత్వం విడుదల చేసిన పాలసీలో రైతుల ప్రస్తావన చాలా తక్కువ! ఆహారపంటలను విస్మరించడం ద్వారా భారీ సంఖ్యలో రైతులను ప్రభుత్వం పక్కనపెట్టింది. వాణిజ్య పంటలకు పెద్దపీట వేశారు. రైతులను ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తామని పాలసీలో పేర్కొన్నారు. ఈ ప్రకృతి వ్యవసాయ పాఠాలు రాష్ట్ర రైతులకు కొత్త కాదు. గతంలో పాలేకర్ విధానాల పేరిట వీటిని విస్తృతంగా ప్రచారం చేసి, వెనక్కి తగ్గిన విషయం తెలిసిందే. రాష్ట్రంలో చిత్తూరు, అనంతపురం, కర్నూలు, గుంటూరు, కృష్ణా, విజయనగరం, పశ్చిమ, తూర్పుగోదావరి జిల్లాల్లో అనేక ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, ప్రొడక్షన్ క్లస్టర్లు, ఫుడ్‌పార్కులు ఉన్న సంగతి తెలిసిందే. అయినా, రైతుల పంటలకు మద్దతు ధర లభించడం లేదు. భవిష్యత్తులోనూ అదే పరిస్థితి కొనసాగే అవకాశం కనిపిస్తోంది. ఇక మహిళల గురించి. డ్వాక్రా, సెల్ఫ్‌హెల్ప్ గ్రూపులనపు ఈ రంగంలో ప్రోత్సహించడం గురించి ప్రస్తావన కూడా పాలసీలో లేదు.

## అంబానీని మించి ఆదానీ



ముంబై: దేశంలోనే అతిపెద్ద పారిశ్రామికవేత్త ముఖేష్ అంబానీ కుమారుడు అనంత్ అంబానీ వివాహం గతేడాది ఎంత చర్చనీయాంశంగా మారిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. చాలా రోజుల పాటు జరిగిన అనంత్ వివాహానికి ముందు కార్యక్రమానికి ప్రపంచవ్యాప్తంగా చాలా మంది ప్రముఖులు హాజరయ్యారు. ఇప్పుడు గౌతమ్ అదానీ కుమారుడు జీత్ అదానీ వివాహం గురించి చర్చలు ప్రారంభమయ్యాయి. వారి వివాహానికి ముందు వేడుక ఉదయపూర్‌లో జరిగింది. కానీ వివాహం ఇంకా జరగలేదు. నివేదిక ప్రకారం, జీత్ అదానీ వివాహానికి చాలా మంది ప్రముఖులు కూడా హాజరవుతారు.గౌతమ్ అదానీ కొడుకు వివాహానికి 50 కి పైగా దేశాల నుండి చెఫ్‌లు, 1,000 కి పైగా లగ్జరీ కార్లను ఏర్పాటు చేయనున్నారు. బాలీవుడ్ నుండి హాలీవుడ్ వరకు అనేక మంది ప్రముఖులు హాజరు కానున్నారు. అదానీ కుమారుడు జీత్ అదానీ గుజరాత్ వజ్రాల వ్యాపారి జైమిన్ షా కుమార్తె దివా జైమిన్ షాను వివాహం చేసుకున్నాడు. వారిద్దరూ మార్చి 2023న నిశ్చితార్థం చేసుకున్నారు. వారి సంబంధాన్ని గోప్యంగా ఉంచారు. కానీ వారి వివాహానికి ముందు వేడుక తర్వాత, వారి వివాహం గురించి చర్చలు అనంత్ అంబానీ లాగానే ప్రారంభమయ్యాయి. ఇప్పుడు జీత్ అదానీ వివాహంలో ప్రముఖ హాలీవుడ్ గాయని టేలర్ స్విఫ్ట్ ప్రదర్శన ఇస్తారని నివేదికలు వస్తున్నాయి.జీత్, దివా షా వివాహ వేడుక అనంత్ అంబానీ వివాహం కంటే మరింత గ్రాండ్‌గా ఉండవచ్చని నివేదికలు ఉన్నాయి. భారతదేశం, విదేశాల నుండి చాలా మంది ప్రముఖ ప్రముఖులు వారి వివాహానికి హాజరు కావచ్చు. నివేదిక ప్రకారం, సంగీత దిగ్గజాలు ట్రావిస్ స్కాట్, హనీ సింగ్ ప్రదర్శన ఇస్తారని, ప్రపంచ దిగ్గజాలు కైలీ జెన్నర్, కెండల్ జెన్నర్, సెలీనా గోమెజ్, సిడ్నీ స్వీనీ కూడా ఈ కార్యక్రమానికి హాజరు కావచ్చు. అదే సమయంలో, టేలర్ స్విఫ్ట్ రాక గురించి కూడా వార్తలు వస్తున్నాయి. అయితే, ఆమె రాకకు సంబంధించి ఇంకా చర్చలు కొనసాగుతున్నాయి. జీత్,దివా వివాహ వేడుకకు ఆమె హాజరవుతుందని అనుకుంటున్నారు. ప్రస్తుతానికి, దీనిపై వారి నుండి ఎటువంటి అధికారిక ప్రకటన రాలేదు.గౌతమ్ అదానీ దేశంలోని అతిపెద్ద పారిశ్రామికవేత్తలలో ఒకరు. ఆయన కొడుకు పెళ్లి చేసుకుంటున్నాడు. కాబట్టి దేశంలోని ప్రఖ్యాత వ్యక్తులు ఖచ్చితంగా దీనికి హాజరవుతారు. ఇది కాకుండా, విదేశాల నుండి కూడా అతిథులు వస్తారు. 1000 కి పైగా లగ్జరీ, ఖరీదైన కార్లలో ప్రజలు వస్తారని.. వారి సేవ, ఆహార సౌకర్యాల కోసం, 58 దేశాల నుండి ప్రసిద్ధ, ఉత్తమ చెఫ్‌లను పిలుస్తారని చెబుతున్నారు.

# మారనున్న పంచాయితీల రూపు రేఖలు!

విజయవాడ: ఏపీ ప్రభుత్వం(మరో కీలక నిర్ణయం దిశగా అడుగులు వేసింది. ముఖ్యంగా పంచాయితీ వ్యవస్థలో సమూల ప్రక్షాళన తీసుకురావాలని భావిస్తోంది. చాలా పంచా యితీల్లో సిబ్బంది లేక ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతున్నాయి. మరోవైపు ఆదాయం కూడా అంతంతమాత్రంగానే ఉంది. ఈ తరుణంలో సిబ్బంది కొరత అధిగమించడంతో పాటు సమన్వయా నికి క్లస్టర్ విధానంలో సమూల మార్పులు తీసుకురావాలని పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటివరకు అమలవుతున్న విధానంతో ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతున్న దృష్ట్యా.. కొత్త క్లస్టర్ విధానాన్ని అమల్లోకి తేవాలని అధికారులను ఆదేశించారు. అందుకు సంబంధించి కార్యాచరణలో పడ్డారు పంచాయతీరాజ్ అధికారులు. ఈరోజు ఉన్నత స్థాయి సమీక్ష పవన్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ మేరకు కీలక నిర్ణయాలు తీసుకున్నారు.పవన్ పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ బాధ్యతలు తీసుకున్నాక చాలా రకాల మార్పులు చోటుచేసుకు న్నాయి. ముఖ్యంగా 4,500 కోట్ల రూపాయలకు సంబంధించి ఉపాధి హామీ నిధులను గ్రామాల అభివృద్ధికి ఉపయోగించాలని పవన్ డిసైడ్ అయ్యారు. గతంలో ఈ నిధులు పక్కదారి పట్టేవి. ఇతర సంక్షేమ పథకాలకు సర్దుబాటు చేసేవారు. కానీ ఈసారిమాత్రం అటువంటి పరిస్థితి లేకుండా చూడాలని పవన్ భావించారు. అందుకే రహదారులతో పాటు కాలువల నిర్మాణానికి ఆ నిధులు కేటాయించారు. పల్లె పండుగ పేరిట పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టారు.స్థానిక సంస్థలను మరింత బలోపేతం చేయడానికి పవన్ ఎంతగానో పరితపిస్తున్నారు. అందులో భాగంగానే గతంలో నిలిచి పోయిన ఆర్థిక సంఘం నిధులను.. నేరుగా పంచాయితీ ఖాతాల్లో జమ అయ్యేలా చూడాలని ఆదేశాలు ఇచ్చారు.ఈమేరకు 15వ ఆర్థిక సంఘం నిధులు నేరుగా పంచాయతీల ఖాతాల్లో జమ అయ్యాయి. వాటితో ప్రజలకు అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టా లని కూడా స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. మరోవైపు పంచాయి తీల్లో స్వాతంత్ర దినోత్సవ




వేడుకలు ఘనంగా నిర్వహించాలని ఆదేశాలు ఇచ్చారు. ఇందుకుగాను ప్రత్యేక నిధులు కూడా కేటాయిం చారు. ఇలా పంచాయితీల విషయంలో సానుకూల నిర్ణయాలు తీసుకుంటూ ముందుకు సాగుతున్నారు పవన్ కళ్యాణ్.సచివాలయ వ్యవస్థవచ్చిన తర్వాత పంచాయతీలు నిర్వీర్యం అయ్యాయి. నామమాత్రంగా మారాయి. ఈ తరుణంలోనే పూర్వవైభవం దిశగా అడుగులు వేయాలని పవన్ భావించారు. అందుకే పంచాయితీల ఆదాయ మార్గాలు పెంచడంతోపాటు సేవలను మరింత విస్తృతం చేయాలని భావించారు. ముఖ్యంగా ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు.. క్లస్టర్ విధానంలో సమూల మార్పులు తీసుకురా వాలని భావిస్తున్నారు. పారిశుద్ధ్య సిబ్బందితో పాటు తాగునీటి నిర్వహణ, వీధి దీపాల నిర్వహణను సక్రమంగా చేపట్టాలని గట్టిగా నిర్ణయించారు. అందుకే వీలైనంత త్వరగా పంచాయితీల విషయంలో పూర్తిస్థాయిలో అధ్యయనం చేసి నివేదికలు ఇవ్వాలని.. తద్వారా చేర్పులు, మార్పులు చేయాలని నిర్ణయించారు. మొత్తానికి అయితే పవన్ పుణ్యమా అని పంచాయతీ వ్యవస్థ మరింత బలోపేతం అవుతు ఒడడం గమనించదగ్గ విషయం.చాలా పంచాయితీలకు ఆదాయం తక్కువగా ఉంటుంది. కానీ జనాభా ఎక్కువగా ఉంటారు. జనాభా ప్రాతిపదికగా తీసుకుంటే అటువంటి పంచాయితీల మనుగడ కష్టం. ఇంకోవైపు చాలా పంచాయితీలకు ఆదాయం సమకూరుతుంది. కానీ అక్కడ జనాభా తక్కువగా ఉంటారు. మౌలిక వసతుల కల్పనకు ఇబ్బందికరంగా ఉంటుంది. అందుకే ఆదాయం, జనాభాను పరిగణలోకి తీసుకొని.. క్లస్టర్లుగా విభజిస్తారు. గ్రేడింగ్ చేస్తారు. అందుకు అనుగుణంగా నిధుల విడుదల, సిబ్బంది నియామకాలు చేస్తారు.

## వివాదంలో సింగర్ మధు ప్రియ..?

కరీంనగర్: ప్రముఖ సింగర్ మధుప్రియ వివాదంలో చిక్కుతుంది. ఆమెపై హిందువులు, బీజేపీ నాయకులు తీవ్రంగా మండిపడుతున్నారు. సింగర్ ను వెంటనే అరెస్ట్ చేయాలంటూ డిమాండ్ చేస్తున్నారు. ఇంతకీ ఏం జరి గిందంటే.. ప్రస్తుతం సినిమా సాంగ్స్ తో పాటు ప్రైవేట్ ఆల్బమ్స్ కూడా చేస్తోంది మధు ప్రియ. అయితే తాజాగా తన ప్రైవేట్ ఆల్బమ్ సాంగ్ ను భూపాలపల్లి జిల్లా కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయంలో షూటి చేయడం వివాదానికి దారి తీసింది. అదికూడా భక్తులు దర్శనానికి రాకుండా గుడి తలుపులు మూసేసి గర్భగుడిలో సాంగ్ షూటింగ్ జరపడం తీవ్ర విమర్శల కు తావిచ్చింది. మధు ప్రియ తీరుపై పలువురు భక్తులు తీవ్ర ఆగ్రహంవ్యక్తం చేస్తున్నారు. గర్భగుడిలో సాంగ్ షూట్‌కు అనుమతి ఎవరు ఇచ్చారంటూ బీజేపీ నాయకులు ప్రశ్నిస్తున్నారు. ఆమెను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలో ఆలయంలో మధు ప్రియ పాట పాడుతున్న వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మా రింది. దేవాలయంలో ఫొటోలు తీయడానికి అనుమతి లేనప్పుడు మధుప్రి య గర్భగుడిలోకిఎలా వెళ్లిందని భక్తులు ఆలయ సిబ్బందిని ప్రశ్నిస్తున్నారు. మధు ప్రియతో పాటు ఆలయ అధికారులు భక్తుల మనోభావాలను దెబ్బతీశారంటూ మండి పడుతున్నారు.చాలా వరకు ఆలయాల్లో ఫొటోలు, వీ డియోలు తీయడంపై నిషేధం ఉంది. అలాగే కాళేశ్వర ముక్తీశ్వర ఆల యంలోనూ ఫొటోలు, వీడియోలు తీయడానికి అనుమతి లేదు. అయితే మధుప్రియతో పాటు ఆమె బృందం ఏకంగా గర్భగుడిలోకి వెళ్లి పాటను చిత్రీకరించినట్లు ఆరోపణలు వినవస్తున్నా యి. అయితే తెలంగాణ రాష్ట్ర దేవాదాయ శాఖ అనుమతితోనే ఆలయంలో పాట చిత్రీకరించారని ప్రచారం జరుగుతోంది. అదేమీ కాదని, స్థానికంగా ఉండేఆలయ సిబ్బందిని ఒప్పించి ఈ పాటను చిత్రీకరించారని మరి కొందరు అంటున్నారు. మరిదీనిపై తెలంగాణ దేవాదాయ శాఖ ఎలా స్పందిస్తుందో చూడాలి. సింగర్ మధు ప్రియ సంక్రాంతికి వస్తున్నాం మూవీలో గోదారి గట్టుమీద సాంగ్‌ను ఆలపించింది.

# డిప్యూటీ సీఎం డిమాండ్ కు సీఎంతో చెక్..!

తిరుపతి: టీడీపీ లోకేష్ డిప్యూటీ సీఎం చేయాలన్న స్లోగన్ బలంగా వినిపించింది. భారీ పరిశ్రమల శాఖమంత్రి టీజీ భరత్ అయితే.. డిప్యూటీ సీఎం కాదు.. ఏకంగా ముఖ్యమంత్రి పదవికి లోకేష్ అర్హుడు అంటూ సంచలన ఆరోపణలు చేశారు. అది కూడా సీఎం చంద్రబాబు ఎదుట అలా అనడంతో ఆయన అసహనం వ్యక్తం చేశారు. మరోవైపు తెలుగుదేశం పార్టీ ప్రత్యేక ప్రకటన ఇవ్వాల్సి వచ్చింది. ఇకముందు ఇలాంటి ప్రకటనలు వద్దు అంటూ పార్టీ శ్రేణులకు ఆదేశాలు ఇచ్చే దాకా పరిస్థితి వచ్చింది. తొలుత మహాసేన రాజేష్ ఈ తేనె తుట్టను కదిపారు. డిప్యూటీ సీఎం పోస్టుకు లోకేష్ అర్హుడు అంటూ వ్యాఖ్యానించారు. అవి క్రమేపీ విస్తరించాయి. రెడ్డప్ప గారి శ్రీనివాసులు రెడ్డి, బుద్దా వెంకన్న, సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, పిఠాపురం వర్మ తదితరులు లోకేష్‌ను డిప్యూటీ సీఎంపదవికి ఎంపిక చేయాల్సిందేనని తేల్చి చెప్పారు. చివరకు అనంతపురంలో సీఎం చంద్రబాబు ఎదుటే సీనియర్ నేత కాల్వ శ్రీనివాసులు సైతం డిమాండ్ చేయడం విశేషం. అయితే ఉన్నట్టుండి టిడిపి హై కమాండ్ దీనిపై స్పందించి ప్రచారానికి బ్రేక్ చేసింది. అయితే తెలుగుదేశం పార్టీ ఈ విషయంలో ఎందుకు వెనక్కి తగ్గిందిఅన్నది ఇప్పుడు చర్చ.రాష్ట్రంలో మూడు పార్టీలు ఉమ్మడిగా ముందుకు వెళుతున్నాయి. కూటమి దశాబ్ద కాలం పాటు కొనసాగాలని భావిస్తున్నాయి. ఈ ఎన్నికల్లో కూటమి కట్టక ముందే ఒక ఒప్పందానికి వచ్చాయి. కూటమి అధికారంలోకి వస్తే చంద్రబాబు సీఎం కావాలని, పవన్ కళ్యాణ్ కు డిప్యూటీ సీఎం ఇవ్వాలని, మిగతా నేతలకు ఇతర పదవులు పంపకాలు చేసుకోవాలని అప్పట్లో నిర్ణయించారు. పవన్ కళ్యాణ్ కు ఏకైక డిప్యూటీ సీఎం హోదా ఇస్తేనే గౌరవం అని అంతా ఏకాభిప్రాయానికి వచ్చారు. అయితే కూటమి అధికారంలోకి వచ్చి ఏడునెలలు కాకమునుపే లోకేష్‌ను డిప్యూటీ సీఎం చేయాలన్న డిమాండ్ తెరపైకి రావడం విశేషం. కేవలం లోకేష్ టీం గా భావించే నేతలే ఈ తరహా వ్యాఖ్యానాలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. వాస్తవానికి తెలుగుదేశం పార్టీలో ఇప్పుడు సుప్రీం లోకేష్ ఎవరు అంగీకరించినా.. అంగీకరించక పోయినా ఇది వాస్తవం. అయితే తెలుగుదేశం పార్టీ పరంగా లోకేష్ ముందంజలో ఉండాలని కోరుకోవడం తప్పులేదు. పైగా నామినేటెడ్ పదవుల పంపకాలు జరుగుతున్న ఇటువంటి సమయంలో.. లోకేష్ ప్రాపకం కోసం ఇలా మాట్లాడిన నేతలు ఉన్నారు. కానీ ఒకేసారి ఒక వ్యూహం ప్రకారం నేతలంతా లోకేష్ ను డిప్యూటీ సీఎం చేయాలని కోరడం మాత్రం.. తెర వెనుక ఏదో జరుగుతోందన్న అనుమానాలు పెరిగాయి. సాధారణంగా టిడిపి అనుకూల మీడియా స్ట్రాటజీ ఒకలా ఉంటుంది. ఇప్పుడు డిప్యూటీ సీఎం చేయాలన్న ప్రతిపాదన కూడా అనుకూల మీడియా నుంచి వచ్చింది. సానుకూలత వస్తే ఒకలా.. లేకుంటే మరోలా వెళ్లడం టిడిపి స్ట్రాటజీ కూడా. లోకేష్ కు డిప్యూటీ సీఎం హోదా విషయంలో కూడా అదే జరిగి ఉంటుందన్న అనుమానాలు ఉన్నాయి.అయితే లోకేష్ ను డిప్యూటీ సీఎం చేయాలన్న ప్రచారంపై వ్యతిరేకత ఎక్కడి నుంచి వచ్చింది అన్నది ప్రశ్న. ప్రజలు పట్టించుకునే స్థితిలో లేరు. లోకేష్ తనను తాను ప్రూవ్‌చేసుకున్నారు. మంగళగిరిలో భారీ మెజారిటీతో గెలిచారు. మంత్రిగా కూడా మంచి మార్కులు పడ్డాయి. ఆయన విషయంలో ఎవరికీ అభ్యంతరాలు ఉంటాయి. జనసేన తో పాటు పవన్‌కళ్యాణ్‌కు మాత్రమే ఉంటాయి అన్నదిఒక అనుమానం. వాస్తవానికిడిప్యూటీ సీఎం అనేది గౌరవం మాత్రమే. టిడిపి హయాంలో ఇద్దరు డిప్యూటీ సీఎంలు ఉండేవారు. వైసిపి హయాంలో అయితే ఏకంగా ఐదుగురిని నియమించారు. వాస్తవానికి పవన్ కళ్యాణ్ డిప్యూటీ సీఎం అయిన తర్వాతే ఆ పదవికి ఎంతో కొంత గౌరవం పెరిగింది. చంద్రబాబు తర్వాత అంతటి ఇమేజ్ పొందగలుగుతున్నారు పవన్.అందుకే ఆ గౌరవం కోసం పరితపిస్తున్నారు తెలుగుదేశం నేతలు.



## పిల్లలకు పాఠాలు నేర్పిన ఆర్డీవో

**వేద న్యూస్ శాయంపేట:**

హనుమకొండ జిల్లా శాయంపేట మండలంలోని మహాత్మ జ్యోతిబా బాలుర గురుకుల పాఠశాలలో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షలో ఎలా చదవాలి, ఎలా రాయాలి, వాటి పద్ధతులను, సమయం ప్రకారం ఏ సబ్జెక్టుఎలా చదువుకోవాలి. సబ్జెక్టు వారీగా ముందుగా అంచనా వేసి ఎన్ని మార్కులకు ప్రిపేర్ కావాలి అనే విషయాలు ఆర్డీవో నారాయణ విద్యార్థులకు క్లుప్తంగా వివరించారు. ప్రతి విద్యార్థిని పలకరించి అర్థమయ్యే విధంగా బోధనా పద్ధతులను చెప్పారు. వీరి వెంట తహసిల్దార్ సత్యనారాయణరావు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్సీ ఎలక్షన్ పోలింగ్ బూత్ పర్యవేక్షణ

**వేద న్యూస్ శాయంపేట:**

27న జరగబోయే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎలక్షన్ సందర్భంగా శాయంపేట మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల పోలింగ్ బూత్ 31ను ఆర్డీవో నారాయణ పరిశీలించినారు. ఏర్పాట్లు సక్రమంగా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. వీరి వెంట తహసిల్దార్ సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి రత్నాకర్ పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాల పరిశీలన

- సిఐతో కలిసి పరిశీలించిన ఎంపీడీవో

**వేద న్యూస్, కమలాపూర్ :**



ఈనెల 27వ తేదీన జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ (మెంబర్ ఆఫ్ లెజిస్లేటివ్ కౌన్సిల్), ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలలో భాగంగా కమలాపూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పోలింగ్ నిర్వహణ కేంద్రాలను కమలాపూర్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి గుండె బాబు, సర్కిల్ ఇన్స్పెక్టర్ హరికృష్ణతో కలిసి పరిశీలించారు. ఓటు హక్కు వినియోగించుకునే ఓటర్లు స్వేచ్ఛాయుత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకునేలా సౌకర్యాలు తగిన విధంగా ఉన్నాయో లేవో పరిశీలన చేసిన అనంతరం ఓటర్లకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని పలు సూచనలు చేశారు. అలాగే పోలింగ్ నిర్వహణ కేంద్రాల్లో పోలింగ్ సిబ్బందికి సంబంధించి తగిన సౌకర్యాలు కల్పించాలని కూడా సూచించారు. ఆ తదుపరి పోలింగ్ నిర్వహణ కేంద్రం ఆవరణలోనే ఉన్నటువంటి పాఠశాలలో నిర్వహిస్తున్న అంగన్వాడి కేంద్రాన్ని పరిశీలించి , పిల్లలకు సరైన పౌష్టికాహారం అందిస్తున్నారో లేదో అని ఆహార పదార్థాలను స్వయంగా పరిశీలించారు. పిల్లలకు నాణ్యతతో కూడిన పౌష్టికాహారాన్ని అందించాలని సిబ్బందికి సూచించారు. ఆ తర్వాత విద్యార్థులతో కాసేపు ముచ్చటించి వారు ఏ విధంగా విద్యనభ్యసిస్తున్నారు, వారి యొక్క నైపుణ్యం ఏ తీరుగా ఉందో పరీక్షించారు.



## వినియోగదారుల చట్టంపై అవగాహన ఉండాలి

**వేద న్యూస్, మిర్యాలగూడ ప్రతినిధి :**

మిర్యాలగూడ రైస్ మిల్లర్స్ అసోసియేషన్‌లో వినియోగదారుల చైతన్య సదస్సు ప్రతిస్పందన వినియోగదారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. నల్గొండ జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి డీఎస్ఓ వెంకటేశ్వర్లు ముఖ్యఅతిథిగా పాల్గొని గ్రామీణ ప్రాంతాలకు వినియోగదారుల రక్షణ చట్టం 2019ని తీసుకుపోవుటకు వినియోగదారుల సంఘాలు కృషి చేయాలని అన్నారు. అనంతరం ప్రతిస్పందన వినియోగదారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు చీతిరాల సాంబశివరావు మాట్లాడుతూ వినియోగదారుడు వస్తువులు కొనేటప్పుడు తగు జాగ్రత్త వహించాలని ధరలు, తూకము తోపాటు నాణ్యమైన వస్తువులు కొనుగోలు చేసి కొనుగోలు చేసిన వస్తువుకు బిల్లులు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. నల్గొండ జిల్లా వినియో గదాల సంఘాల అధ్యక్షుడు హిమగిరి, ఏలే వెంకటేశ్వర్లు గురవయ్య, పూర్ణచంద్రరావు, గోళ్ళ రంగయ్య, మిర్యాలగూడ అసోసియేషన్ అధ్యక్షుడు,మాజీ అధ్యక్షులతో పాటు పలువురు సీనియర్ సిటిజన్స్ పాల్గొన్నారు.

## వేసవిలో నీటి ఎద్దడి లేకుండా సరఫరా జరగాలి

**వేద న్యూస్, వరంగల్ :**

వేసవిలో నీటి ఎద్దడి లేకుండా నీటి సరఫరా జరగాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డా. సత్య శారద అధికారులను ఆదేశించారు. గ్రేటర్ వరంగల్ 34 వ డివిజన్ శివనగర్ లో మంగళవారం బల్దియా కమిషనర్ డా. అశ్విని తానాజీ వాకడే, అదనపు కలెక్టర్ సంధ్య రాణి తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేసి చివరి ఇంటి వరకు నీటి సరఫరా జరుగుతున్న తీరును కలెక్టర్ స్థానికులను నేరుగా అడిగి తెలుసుకున్నారు. దేశాయి పేట లో బల్దియా చే నిర్వహించబడుతున్న ప్రతాపరుద్ర ఫిల్టర్ బెడ్‌లో కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు.

# సమస్యల వలయంలో చింతలపల్లి..!

- 'ప్రత్యేక' పాలనలో పట్టింపు లేదా?
- సమస్యల పరిష్కారానికి పట్టించుకునే వారు లేరా?

**వేద న్యూస్, ఎల్కతుర్తి :**




హన్మకొండ జిల్లా ఎల్కతుర్తి మండల పరిధిలోని చింతలపల్లి గ్రామం సమస్యల వలయంలో చిక్కుకుంది. వేసవి కాలం ప్రారంభం కాక మునుపే గ్రామస్తులు తాగునీటికి ఇబ్బందులు పడే పరిస్థితులు దాపురించాయి. గ్రామానికి తాగునీరు అందించే నల్లాల బావి మోటర్ కాలి పోవడంతో పాటు తాగునీటిని రూ.3 కే అందించే బాలవికాస ప్లాంట్ సైతం పని చేయడం లేదు. రోజులు గడుస్తున్నా ఈ సమస్యల పరిష్కారానికి పట్టించుకునే నాథుడే లేదన్నట్టుగా వ్యవహారం నడుస్తోందని పేర్కొంటున్నారు.

**తాగునీటికి ఇక్కట్లు**

చింతలపల్లి గ్రామస్తులు తాగునీటికి వ్యవసాయ బావులు, ప్రైవేటు వాటర్ ప్లాంట్ల వద్దకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. రూ.3కే 20 లీటర్ల మినరల్ వాటర్ బాలవికాస వాటర్ ప్లాంట్ ద్వారా అందేది. కానీ, ప్రస్తుతం ప్రైవేటు వాటర్ ప్లాంట్ వద్ద రూ.10కి 20 లీటర్ల వాటర్ క్యాన్ తీసుకురావాల్సిన పరిస్థితి ఏర్పడిందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఇంకా ఎండాకాలం పూర్తిగా రాకమునుపే అటు గ్రామంలో తాగునీటిని అందించే మినరల్ వాటర్ ప్లాంట్‌తో పాటు నల్లాల బావి నీళ్లు ప్రజలకు అందడం లేదని ఊరి ప్రజలు వెల్లడిస్తున్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి, స్పెషల్ ఆఫీసర్ ఈ సమస్యల పరిష్కారానికి స్పందించాలని కోరుతున్నారు.

# జర్నలిస్టుల దాడుల కమిటీ పునరుద్ధరణకి సహకరిస్తా..

- కలెక్టర్ దివాకర
- టీఎస్ జేయు ఆధ్వర్యంలో జర్నలిస్టులకు రూ.5 లక్షల ప్రమాద బీమా పత్రాలు అందజేత

**వేద న్యూస్, ములుగు :**



జర్నలిస్టులపై దాడులకు సంబంధించిన కమిటీని త్వరలో పునరుద్ధరిస్తానని ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ అన్నారు. తెలంగాణ స్టేట్ జర్నలిస్టు యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పురుషోత్తం నారగొని ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోకల అనిల్ కుమార్ ఆధ్వర్యంలో యూనియన్ అంద చేస్తున్న ఉచిత ప్రమాద బీమా పత్రాలను ములుగు జిల్లా సభ్యులకు మంగళవారం కలెక్టర్ అందచేశారు. ఈ సందర్భంగా ములుగు జిల్లా కమిటీ సభ్యులు జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ నీ కలిసి జర్నలిస్టుల దాడుల కమిటీనీ పునరుద్ధరించాలని వినతి పత్రాన్ని అందజేసారు. ఈ సందర్భంగా ములుగు జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విధి నిర్వహణలో భాగంగా ఎంతో మంది జర్నలిస్టులు ప్రమాదాలకు గురై ఇబ్బందులు పడుతుంటారు ఆ సమయంలో వీరికి ప్రమాద బీమా ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. జర్నలిస్టులందరికీ ప్రమాద బీమా కల్పించడం పట్ల తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్ యూనియన్ నాయకులను కలెక్టర్ ఈ సందర్భంగా అభినందించారు. టీ.ఎస్.జే.యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోకల అనిల్ కుమార్ మాట్లాడుతూ జర్నలిస్టులకు గల సమస్యలను మరియు ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో జర్నలిస్టులకు మొదట ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ నీ కోరారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా అధ్యక్షులు చల్లగురుగుల రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి సంగ రంజిత్, గౌరవ అధ్యక్షులు పడమటింటి నగేష్,ఉపాధ్యక్షుడు నగపురి హరినాథ్ గౌడ్,ఆర్గనైజింగ్ సెక్రటరీ కంచర్ల రాజు, ఈసీ మెంబర్ అనిల్ కుమార్, సంపంగి సాంబరాజు, గంద్రత్ విజయకుమార్,పెండెం భిక్షపతి,చల్లూరి మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వాలు మారినా కార్మికుల బ్రతుకులు మారలేదు

**వేద న్యూస్, దామచర్ల :**



దామరచర్ల మండలంలోని గ్రామపంచాయతీ సిబ్బంది సమస్యల పైన సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు దామరచర్ల మండలం ఎంపీడీవో కు సిఐటియు మండల కార్యదర్శి బైరం దయానంద్ గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు కార్యదర్శులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి బైరం దయానంద్ మరియు గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ ప్రభుత్వాలు మారిన గ్రామపంచాయతీ కార్మికుల బతుకు మారలేదు అని జిపి సిబ్బంది తక్కువ వేతనాలతో పనిచేస్తున్నారు. అని నర్సరీ పనులు, డంపింగ్ యార్డ్స్, పల్లె ప్రకృతి వనం అన్ని పనులు చేయకుంటే ఇంకొకరిని పెట్టుకుంటామని బెదిరిస్తున్నారు అన్ని పనులకూ మమ్మల్నే వాడడం ఎంతవరకు సమంజసం అని జీపీ కార్మికుల డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా జిపి కార్మికుల గుర్తింపు కార్డు అమలు చేయాలన్నారు. జీవో 51 ని తొలగించి కేటగిరీల వారిగా గుర్తించాలన్నారు. కార్మికులకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ రిటైర్మెంట్ అయిన తర్వాత తగినంత పింఛన్ లేకపోవడం చాలా ఇబ్బంది పడాల్సి వస్తుంది అదే విధంగా ఐదు లక్షల పింఛను అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నూతన అధ్యక్షులు పాతులోతు విజయ్ కుమార్ ,ఉపాధ్యక్షులు గుండు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి అక్కినపల్లి సైదులు, కోశాధికారి ముడుసు సైదయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కృత్యమేళా

**వేద న్యూస్, మరిపెడ :**



మరిపెడ మున్సిపాలిటీలోని, మరిపెడ పాఠశాలలో, మరిపెడ పాఠశాల సముదాయ సమావే శంలో ఘనంగా కృత్యమెళా నిర్వహించారు. ఈ ప్రదర్శన కార్యక్రమాన్ని మరిపెడ స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఏర్వ అనంతరావు రిబ్బన్ కటింగ్ చేసి ఆవిష్కరించారు. ఈ మేళాలో పాఠశాల సముదా యంలోని 18 పాఠశాలలు పాల్గొ న్నారు. తెలుగు, ఆంగ్లం, గణితం, పరిసరాల విజ్ఞానం విషయాలలో బోధన అభ్యసన సామాగ్రిని ప్రదర్శించారు. ఈ సమావేశంలో రిసోర్స్ పర్సన్లు వెంకన్న, శ్రీనివాస్ మరియు న్యాయ నిర్ణీతలు ఆంగ్లంలో బయగాని రామ్మోహన్, తెలుగు మంజుశ్రీ, గణితం బాబురావు, పరిసరాల విజ్ఞానం జనార్ధన చారి వ్యవహరించారు. ఇందులో దక్న తండా అత్యధికంగా బహుమతులు సాధించడం జరిగింది. తర్వాత మరిపెడ పాఠశాల, తదితర పాఠశాలలు విజేతలుగా నిలవడం జరిగింది. విజేతలకు షీల్డ్ మరియు ప్రశంసా పత్రములు అందజేయడం జరిగింది. ఈ సమావేశంలో స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ అన్ని పాఠశాలలు కూడా బోధనాభ్యాసన సామాగ్రిని అద్భుతంగా తయారు చేశారన్నారు. ఈ యొక్క సామాగ్రిని బోధనా ప్రక్రియలో ఉపయోగించి విద్యార్థులను తీర్చిదిద్దాలని కోరారు. ప్రధానోపాధ్యాయులందరూ ఎప్పటికప్పుడు జిల్లా నుండి అడిగేటువంటి సమాచారాన్ని సత్వరమే అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మరిపెడ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అమ్మి, వివిధ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు

**వేద న్యూస్, హనుమకొండ :**

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు హనుమకొండ ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. ఈ మేరకు మంగళవారం వారు ప్రకటన విడుదల చేశారు. మహాశివరాత్రి పర్వదినం సంద ర్భంగా పూజల నిమిత్తం భక్తులు తమ వాహనాల్లో వేయిస్తంభాల గుడికి వేలాదిగా తరలివస్తారని, కానీ ఆలయం దగ్గర పరిసరా లలో ఎలాంటి పార్కింగ్ స్థలాలు లేవన్నారు. కావునా భక్తులు సాధ్యమైనంత త్వరగా ఆలయానికి చేరుకుని దర్శనం చేసుకోవాలనే ఉద్దేశ్యంతో ట్రాఫిక్ రాకపోకలను క్రమబద్ధీకరణ చేయడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా ములుగు క్రాస్ రోడ్ నుండి వేయిస్తంభాల గుడి వైపు వచ్చే భక్తుల వాహనాలను అలంకార్ జంక్షన్ వరకు మాత్రమే అనుమతిస్తామన్నారు. హన్మకొండ చౌరస్తా నుంచి వచ్చే భక్తుల వాహనాలను అమృత జంక్షన్ వరకు మాత్రమే అనుమతిస్తామన్నారు. కావున భక్తులు ఇది గమనించి తమ ఏర్పాట్లు చేసుకోవాలని మనవి చేశారు.. అలాగే ములుగు క్రాస్ రోడ్డు నుండి వేయిస్తంభాల గుడి వైపు వచ్చే సాధారణ వాహనాలు టూవీలర్స్, ఆటోలు, కార్లు మొదలగు వాహనాలు అలంకార్ సెంటర్, కాపువాడ, బాలంజినేయ స్వామి దేవాలయం మీదుగా ప్రయాణించాలి. అలాగే బాలంజినేయ దేవాలయం నుంచి కాపువాడ వైపు ఎటువంటి వాహనాలు అనుమ తించబడవు. అలాగే హన్మకొండ చౌరస్తా నుండి వేయిస్తంభాల గుడి వైపు ప్రయాణించే సాధారణ వాహన దారులు, అమృత జంక్షన్ నుండి యాదవనగర్ మీదుగా వెళ్లవలెను. అంతే కాకుండా వేయిస్తంభాల ఆలయ పరిసర ప్రాంతాలలోని మెయిన్ రోడ్డులో వాహనాలను పార్కింగ్ చేయరాదు. ఈ ఆంక్షలు 26 ఉదయం 3 గంటల నుండి 27 మధ్యాహ్నం 12 గంటల వరకు కొనసాగుతాయి.

# ఉక్కుపాదం ఉత్తమాటేనా?

**మొదటి పేజీ తరువాయి**

గ్రామాల ప్రాంతంలోని ఉన్నతాధికారులు ఇసుక అక్రమ రవాణాపై కఠిన చర్యలు తథ్యమని చెప్తుంటే.. కొంతమంది అధికారులు అక్రమార్జన ధ్యేయంగా ఇసుక దళారులకు సహాయ సహకారాలు పుష్కలంగా అందిస్తున్నారనే వాదనలు చాలా బలంగా వినిపిస్తున్నాయి. ఇదే అదునుగా భావించిన కొంతమంది అవినీతి అధికారులు దోచిన కాడికి దోచుకుంటూ దళారులకు సహకారం చేస్తున్నారని ఆరోపణలు లేకపోలేదు. ఇప్పటికైనా ఇసుక అక్రమ రవాణా పట్ల ఉన్నత అధికారులు స్పందించి అక్రమ రవాణా చేసే వారిని వారికి సహకరించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

**శ్రీరాంపూర్ పోలీసుల రూటే సెప 'రేటు'?**

పోలీస్ స్టేషన్ కూత వేటు దూరంలోనే మానేరు పరిహార ప్రాంతంలో ఇసుక రవాణా జరుగుతున్నా, స్టేషన్ ముందు నుంచి వెళ్లే ఇసుక ట్రాక్టర్ల పై పోలీసులు ఎందుకు అడ్డుకోలేకపోతున్నారనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

అదే ద్విచక్ర వాహనంపై వెళ్లే వాహనదారులు హెల్మెట్ ధరించకపోతే చెట్టు చాటు నుంచి ఫొటోలు తీసి ఫైన్‌లు వేసే పోలీసులకు. అక్రమంగా ఇసుక రవాణా జరుగుతుంటే వారి కంటికి కనబడటం లేదా? అనేవిమర్శలు వెలువెత్తుతున్నాయి. ఇప్పటికైనా పోలీసు ఉన్నత అధికారులు వీరి అక్రమాలకు అడ్డుకట్ట వేసి కఠినమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

**ప్రతిపక్షంలో ఒక లాగా..అధికారంలోకి వచ్చాక మరొకలాగా..?**

గత ప్రభుత్వంలోనూ అక్రమంగా టన్నులకొద్దీ ఇసుక రవాణా జరిగేది. అందువల్ల భూగర్భ జలాలు నీరు అందక రైతులు అరిగోసలు పడేవారు. అధిక మొత్తంలో లారీలు తిరగడంతో రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. రోడ్డు ప్రమాదాలు సైతం జరిగేవి. లారీల బెడదతో రోడ్లపై తిరగాలంటే ప్రజలు, వాహనాదారులు భయాందోళనకు గురి అయ్యేవారు. గతంలో ప్రతిపక్షంలో ఉన్న రాజకీయ నేతలు అక్రమ ఇసుక దందాపై అనేక ఉద్యమా కార్యక్రమాలు చేపట్టారు. ఇప్పుడు వారు అధికారంలోకి రాగానే ఈ ఇసుక దందాపై ఎందుకు నోరు మెదపడం లేదు? అనే ప్రశ్న ప్రతి ఒక్కరి నుంచి వస్తోంది. ఇప్పటికైనా రాజకీయ నేతలు ఇది గమనించి అక్రమ ఇసుక రవాణాను అరికట్టాలని జనం కోరుతున్నారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073